నర్సింహులపేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పని చేయించకపోతే సస్పెండ్?

- ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు అధికారుల హెచ్చరిక
- పనిభారంతో ఒత్తిడికి గురవుతున్న ఎఫ్‌ఏలు
- ఐదారు గ్రామాలకు ఒక్కడే ఫీల్డ్ అసిస్టెంట్లు
- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- భారంగా మారిన కుటుంబ పోషణ

నర్సింహులపేట, మార్చి 14 : ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కొరత నెలకుంది.. దీంతో పనులు జరిగే ప్రదేశంలో కూలీల హాజరు నమోదు, పనుల గుర్తింపు.. కూలీ చేసిన పనులకు బిల్లుల చెల్లింపు కష్టంగా మారింది. అవినీతి అక్రమాలకు పాల్పడిన పలువురిని తొలగించారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించపోవడంతో విధుల్లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లపై పని భారం ఎక్కువైంది. ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఐదు, ఆరు గ్రామాలు ఇన్‌చార్జీలు ఇవ్వడంతో తిప్పలు పడుతున్నారు. నూతనంగా ఏర్పాటైన జీపీల్లో కొత్తవారిని నియమించకపోవడంతో పాత జీపీ వారే చూసుకోవాల్సివస్తుంది. ప్రతి గ్రామంలో ప్రతి రోజు కనీసం 50మందికి ఉపాధి పనులు కల్పించాలి.. లేక పోతే సస్పెండ్ చేస్తామని జిల్లా అధికారుల నుంచి ఒత్తిడి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నర్సింహులపేట మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా ఆరుగురు మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ఒక్కో ఫీల్డ్ అసిసెంట్‌కు నాలుగు నుంచి ఆరు జీపీల బాధ్యతలు అప్పగించారు. దీంతో కూలీల రికార్డులు, మస్టర్లలో పేరు నమోదు చేయడం, బిల్లులు చెల్లింపులు చేసేందుకు సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా సిబ్బంది నియామకాలు లేక పనుల్లో పారదర్శకత సైతం లోపించింది. రైతుల అవసరాలకు అనుగుణంగా పనులు గుర్తించడంలో ఆలస్యం జరుగుతుందని చెబుతున్నారు. మండలంలోని ఉమ్మడి పెద్దనాగారం జీపీ పరిధిలో మరో ఐదు జీపీలు ముంగిముడుగు, జయపురంలో రెండు, రామన్నగూడెం, నర్సింహులపేట, కొమ్ములవంచ, పడమటిగూడెంలో ఒకటి చొప్పున జీపీలు అనదంగా 13 ఏర్పాటయ్యాయి. గతంలో ఉన్న 10జీపీల పరిధిలో ఆరుగురు ఫీల్డ్ అసిసెంట్లు మాత్రమే పని చేస్తుండటంతో ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్‌కు నాలుగు నుంచి ఆరు జీపీలు ఇన్‌చార్జీలుగా చేయాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు.

నాలుగు నెలలుగా వేతనాలు రాక..

గ్రామాలో ఇన్‌చార్జీగా పని చేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిసెంట్లకు నెలనెలా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇన్‌చార్జీలుగా ఇతర జీపీల బాధ్యతలు ఇవ్వడంతో కనీసం బండి పెట్రోల్‌కు సైతం వేతనం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కింగ్ ఫిషర్ బీరులో చెత్త..

అవాక్కైన మద్యం ప్రియుడు

పెద్దవంగర, మార్చి 14 : కింగ్ ఫిషర్ బీర్లలో చెత్త వచ్చిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండలంలోని రాజామాన్సింగ్ తండా జీపీకి చెందిన బాధితుడు జాటోత్ హేమాని వివరాల ప్రకారం.. హోలీ పండుగ సందర్భంగా తోటి మిత్రులు, తండావాసులతో కలిసి హేమాని ఓ బెల్టు షాపులో కింగ్ ఫిషర్ బీర్లు కొనుగోలు చేశాడు. అందులో చెత్త రావడంతో ఒక్కసారిగా అవాక్కయ్యాడు. చెత్త వచ్చిన బాటిల్‌ను చూపించి బెల్టు నిర్వాహకులతో మాట్లాడడంతో వాటిని తీసుకొని వేరే బీర్లు అందించినట్లు తెలిపారు. కాగా వాటిని మహేశ్వర వైన్ షాప్‌లో కొనుగోలు చేశామని బెల్టు షాపు నిర్వాహకులు చెప్పారని బాధితుడు హేమాని తెలిపాడు. దీనిపై ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.

బీరులో వచ్చిన చెత్త(సర్కిల్‌లో)

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కమర్షియల్ స్పేస్‌లు అమ్మకం
★ హనుమకొండలో కిరాయిలు వచ్చు 1650, 2500, 6000 Sft. కమర్షియల్ స్పేస్‌లు తక్కువకు అమ్మకానికి కలవు. వెంటనే సంప్ర: సెల్: 9348199922.
NTW-332339

WANTED TEACHERS
★ WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.
NTW-482

PLOT FOR SALE

★ జనగామ కలెక్టరేట్‌కు & కొత్త విమానాశ్రయం, Textile Parkకు అతి చేరువలో DTCP/ RERA approved Layoutతో గజం కేవలం 5,499/-కి పొందండి with all Developmenting. Contact: 7780324073.
NT-330714

PLOT FOR SALE
★ హైదరాబాద్‌లో నూతన నగరం ఫ్యూచర్ సిటీ శ్రీశైలం హైవే మహేశ్వరంలో ఓపెన్ ప్లాట్స్ కలవు. 100 చ.గజాలు 6 లక్షలు మాత్రమే... మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు... 100% రిటర్న్స్... EMI కలదు. Cont: 8008091512.
NT-330716

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563 9182777961	9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

కేసముద్రం : మండల కేంద్రంలో హోలీ ఆడుతున్న యువకులు

రంగుల కేళీ రంగోలీ

- ఊరూరా అంబరాన్నంటిన హోలీ సంబురాలు
- చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకొని వేడుకలు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- డీజేలతో ర్యాలీలు

కురవి: కేసీఆర్ పేర్లు రాసుకొని వేడుకల్లో పాల్గొన్న యువకులు

నమస్తే తెలంగాణ నెట్ వర్క్, మార్చి 14 : జిల్లాలో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వేడుకల్లో పాల్గొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు సైతం ఈ ఏడాది వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజేలు ఏర్పాటు చేసుకొని హోలీ ఆడుకుంటూ ర్యాలీ తీశారు. అనంతరం యువత విందు కార్యక్రమంలో మునిగితేలారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ సీతామహాలక్ష్మీ దంపతులు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి హోలీ వేడుకల్లో సందడి చేశారు. చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌కు మరిపెడ జర్నలిస్టులు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పోలీసు అధికారులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. కురవి మండలంలోని కందికొండ గ్రామ యువకులు మాజీ సీఎం కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో తెల్లటి జుబ్బాలపై రంగులతో కేసీఆర్ అని రాసుకుని వేడుకలు జరుపుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి హోలీ ఆడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

మరిపెడ : మాజీ ఎమ్మెల్యే రెడ్యాతో హోలీ వేడుకల్లో పాల్గొన్న జర్నలిస్టులు

గార్లలో హోలీ సంబురాల్లో యువత

నెల్లికుదురులో హోలీ వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

దంతాలపల్లిలో హోలీ ఆడుతున్న యువకులు

బయ్యారం శ్రీనివాసనగర్‌లో హోలీ వేడుకలు

హోలీ సంబురాల్లో తొర్రూరు బీఆర్‌ఎస్ నాయకులు

నర్సింహులపేట : హోలీ వేడుకల్లో పాల్గొన్న యువత

ఎస్పీ ఆఫీస్‌లో హోలీ సంబురాల్లో పోలీసు అధికారులు

గూడూరులో హోలీ సంబురాల్లో పాల్గొన్న వీహెచ్‌పీ జాతీయ నేత కేశవరావు

నేడు ప్రభుత్వ దిష్టి బొమ్మల దహనం

మహబూబాబాద్ రూరల్, మార్చి 14 : శాసనసభలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉంటే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని భయంతోనే ప్రభుత్వం వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుందని మాజీ ఎంపీ, జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాలోత్ కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక వైఖరి, సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వ పోకడలు నిరసిస్తూ నేడు(శనివారం) నియోజకవర్గ కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టి బొమ్మలు దహనం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం

కిశోర్‌కుమార్

దంతాలపల్లి, మార్చి 14 : రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు వీరబోయిన కిశోర్‌కుమార్ అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అసెంబ్లీ సమావేశంలో ప్రశ్నించినందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాలనుంచి సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సభకు దూరం చేయాలనే ఉద్దేశంతోనే అధికారపక్షం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జగదీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నర్సింహులపేట, మార్చి 14 : కుటుంబంలో వచ్చిన చిన్నచిన్న తగాదాలకు భార్య నిప్పటించుకుని మృతి చెందడంతో బాధతో భర్త పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై మాలోత్ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అజ్మీరతండా జీపీ పరిధిలోని వాంకుడోత్ తండాకు చెందిన వాంకుడోత్ భీమా(46) ఫిబ్రవరి 23న భీమా భార్య బుజ్జి కుటుంబ తగాదాలతో నిప్పటించుకుని చికిత్స పొందుతూ ఫిబ్రవరి 27న మృతి చెందింది. భార్య మృతితో మనస్తాపం చెందిన భీమా ఈ నెల 3న పురుగుల (గడ్డి) మందు తాగి విషయం కుటుంబ సభ్యులకు తెలిపాడు. చికిత్స నిమిత్తం అతన్ని ఖమ్మం ప్రైవేట్ దవాఖానకు తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రుల మృతితో ఇద్దరు కుమారులు అనాథలయ్యారు.

మానుకోటలో మరొకరు..

మహబూబాబాద్ రూరల్, మార్చి 14 : చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన మండల శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో ఉత్తర తండా గ్రామ పంచాయతీ పరిధిలోని రాయికుంటతండాకు చెందిన బానోత్ సురేశ్(27) గత నెల 20న మానుకోటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఈదులపూసపల్లి క్రాస్ రోడ్ వద్ద ఓ కారు బలంగా ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడిన సురేశ్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య భూమిక, ఒక కుమారుడు ఉన్నారు.

అధ్వానంగా రహదారులు

ఇబ్బందుల్లో ప్రయాణికులు

గుంతలుగా మారిన పెద్దముప్పారం నుంచి రామానుజపురానికి వెళ్లే బీటీ రోడ్డు

కుమ్మరికుంట్ల నుంచి రేపోణి వెళ్లే రోడ్డుపై గుంతలు

దంతాలపల్లి, మార్చి 14 : మండలంలోని అంతర్గత రోడ్లు అ ధ్వానంగా ఉన్నాయి. మండలంలోని పెద్దముప్పారు నుంచి రామానుజపురం వెళ్లే రోడ్డు, కుమ్మరికుంట్ల నుంచి రేపోణి , రామవరం, వేములపల్లి, వాల్యాతండా, దాట్ల వెళ్లే అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారాయి. గత కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడే ఈ రోడ్ల మరమ్మతుల కోసం నిధు లు మంజూరు చేసింది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యేడాది గడిచినా ఈ రోడ్లకు మరమ్మతులు చేయలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతైన గుంతలు పడి ప్రమాదకరంగా మారిన ఈ రోడ్లపై వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వర్షకాలం వస్తే ఈ రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

అన్నీ తానై అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

పాడెమోసిన సీఐ పెండ్యాల దేవేందర్

పాడెమోస్తున్న సీఐ పెండ్యాల దేవేందర్

నెల్లికుదురు, మార్చి 14 : ఆ వృద్ధురాలు ఆలేరు గ్రామానికి చెందిన ఓ అనాథ...ఎవరూ లేక ఉండడానికి ఇల్లు... తినడానికి తిండిలేక కడు దీనస్థితిలో ఉన్న ఆలేరు గ్రామానికి చెందిన వృద్ధురాలు చీకటి ఉపేంద్ర(65)ను 2018సంవత్సరంలో నెల్లికుదురు ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న పెండ్యాల దేవేందర్ చేరదీశాడు. ఆ వృద్ధురాలికి తన సొంత ఖర్చులతో ఓ ఇళ్లు కట్టించాడు. నిత్యావసర వస్తువులు అందిస్తూ తనకు తోచిన మేర వృద్ధురాలి అవసరాలు తీరుస్తూ వచ్చారు. దేవేందర్ నెల్లికుదురు నుంచి బదిలీపై వెళ్లినప్పటికీ ఆమె బాగోగులు చూడడం మాత్రం మర్వలేదు. ఇలీవల బదిలీల్లో పెండ్యాల దేవేందర్ మహబూబాబాద్ టౌన్ సీఐగా వచ్చారు. వృద్ధురాలు అనారోగ్యానికి గురై శుక్రవారం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పెండ్యాల దేవేందర్ దిగ్భ్రాంతికి గురై ఆలేరు గ్రామానికి చేరుకుని దగ్గరుండి పాడెమోసి గ్రామస్తులతో కలిసి అంత్యక్రియలు జరిపించి మానవీయతను చాటుకున్నారు. సీఐ దేవేందర్ మానవీయతను చూసి ప్రతి ఒక్కరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి

కారల్ మార్క్స్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గార్ల, మార్చి 14 : కమ్యూనిజం పితామహుడు కారల్ మార్క్స్ వర్ధంతి వేడుకలు మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కారల్ మార్క్స్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి, రామకృష్ణ, నాగరాజు, నాగేశ్వరావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లీజ్ దాహం వేస్తుంది..
కాసిన్ని మంచినీళ్లు ఇవ్వరా..!

- వేసవి నేపథ్యంలో పక్షుల దాహం తీర్చాలని వేడుకుంటూ వెలసిన కరపత్రం
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పాంప్లెంట్

మరిపెడ, మార్చి 14 : ప్లీజ్ దాహం వేస్తుంది కాసిన్ని మంచి నీళ్లు ఇవ్వరా అనే సారాంశంతో కూడిన పక్షుల ఆవేదనతో అచ్చువేసిన పాంప్లెంట్ శుక్రవారం స్థానికంగా సోషల్ మీడియాలో వైరల్ అ య్యింది. ''వేసవికాలం వచ్చేసింది. ఆహా రం కోసం గూడు వదలి ఎండలో ఎగురుతుంటే రెక్కలు అలసి నీరసం వచ్చేస్తుంది. దాహంతో గొంతు ఎండిపోతుంది. పోయిన ఏడాది మా పక్షి జాతిలో పక్షులు నీటి చుక్క దొరకక దాహంతో చనిపోయాయట. కాసిన్ని నీళ్లు ఇచ్చి మా ప్రాణాలు కాపాడమని ప్రాధేయ పడుతున్నాం'' అని ముద్రించి పాంప్లెంట్‌ను చూసిన జంతు ప్రేమికులు వినూత్న ఆలోచనతో ప్రజలు ఆలోచన చేసే విధంగా చేసిన వారికి సెల్యూట్ చేస్తున్నారు.


దాహం వేస్తుంది
కాసిన్ని మంచినీళ్ళు ఇవ్వరా
సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పాంప్లెంట్

వ్యవసాయ మోటర్ చోరీ

చోరీకి గురైన మోటర్

చిన్నగూడూరు, మార్చి 14 : వ్యవసాయ బావివద్ద ఉన్న మోటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన మండలంలోని ఉగ్గంపెల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు మా లోత్ రాజ్యు తెలిపిన వివరాల ప్రకారం... వ్యవసాయ బావికి అమర్చిన మోటర్ అపహరణకు గురైనట్లు తెలిపారు. రోజు మాదిరిగానే పొలానికి నీరు అందించేందుకు శుక్రవారం ఉదయం వెళ్లే సరికి మోటర్ కనిపించలేదన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

పట్టణంలో నీటి కొరతను తీర్చాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 14 : మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో నీటి ఎద్దడిని నివారించాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ అన్నారు. శుక్రవారం ఇందిరానగర్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ఎండకాలం వచ్చిందంటే భూగర్భ జలాలు అడుగంటి ప్రజలకు నీటి సమస్య తీవ్రంగా వస్తుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని, లేదంటే దశలవారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండీ రజాక్, రాజేశ్, నాగేశ్, స్రవంతి, రవి, బాబురావు పాల్గొన్నారు.

గోటి తలంబ్రాలను భద్రాచలం తీసుకెళ్తున్న మహిళలు

భద్రాద్రికి తరలిన గోటి తలంబ్రాలు

బయ్యారం మార్చి 14 : శ్రీ సీతారాముల కల్యాణానికి సమర్పించేందుకు తయారు చేసిన గోటి తలంబ్రాలను శుక్రవారం మహిళలు భద్రాద్రికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో రాజమండ్రి నుంచి తీసుకువచ్చిన ధాన్యాన్ని మహిళలు చేతితో వలిచి గత పది రోజులుగా తలంబ్రాలుగా తయారు చేశారు. ఆలయ పూజారి సుదర్శనచార్యుల ప్రత్యేక పూజల అనంతరం వాటిని తీసుకొని భద్రాచలం తరలివెళ్లి అక్కడ ఆలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యులు వెంకటేశ్వరావు, వైఎస్‌రెడ్డి, కోటేశ్వరావు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

రాయపర్తి, మార్చి 14: చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మైలారంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని మారెమ్మకుంట (తాళ్లకుంట)లో చేపలు పట్టేందుకు గ్రామానికి చెందిన బాద వెంకన్న(38) గురువారం ఉదయం వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రి కుంట వద్దకు వెళ్లి వెతికారు. ఈ క్రమంలో వెంకన్న నీటిలో శవమై కనిపించాడు. వెంటనే శవాన్ని బయటకు తీసి ఇంటికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కెనాల్‌లో జారిపడి వృద్ధురాలి మృతి

పర్వతగిరి: చౌటపల్లి హట్యతండా శివారు ఎర్రగుంటతండాలో బాదావత్ నేజి(68) ఎస్సారెస్పీ కాల్వ సమీపంలో దుస్తులు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి మృతి చెందింది. నేజి గురువారం సాయంత్రం బట్టలు ఉతికేందుకు కెనాల్ వద్దకు వెళ్లింది. దుస్తులు ఉతికే క్రమంలో కాల్వలో జారీ పడి కొట్టుకుపోయింది. శుక్రవారం నెక్కొండ మండలంలోని బొల్లికొండతండా కెనాల్‌లో నేజి మృతదేహానికి కనుగొన్నారు. మృతురాలు కుమారుడు చంద్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి

సంగెం, మార్చి 14: బొలేరో వాహనం బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో తాపీమేస్త్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామానికి చెందిన కోయ బంగారు బాబు(34) మండలకేంద్రంలో ఉంటూ తాపీమేస్త్రి పనులు చేస్తున్నాడు. శుక్రవారం బంగారు బాబు తోటి మేస్త్రి పులగర శివమణితో కలిసి పనుల కోసం బైక్‌పై తిమ్మాపురం గ్రామానికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్నాడు. మార్గమధ్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వరంగల్ నుంచి సంగెం మీదుగా నెక్కొండ వైపు అరటి గెలలు తీసుకొచ్చేందుకు వెళ్తున్న బొలోరో వాహనం అతివేగంగా ఎదురుగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బంగారు బాబుకు తీవ్ర గాయాలు కాగా, మణికంఠ కాలు, చేయి విరిగింది. వారిని అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో బంగారు బాబు మృతి చెందాడు. మణికంఠ చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

కరీమాబాద్, మార్చి 14: చికిత్స పొందుతూ చిన్నారి మరణించింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీమాబాద్ తోట్లవాడకు చెందిన శీలం అద్విత(5) ఈ నెల 7న ఇంటి సమీపంలోని గుడికి వెళ్లింది. ప్రమాదవశాత్తు బాలికకు దీపం అంటుకుంది. దీంతో కుటుంబ సభ్యులు పాపను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించింది.

బైక్ పైనుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

నెక్కొండ, మార్చి 14: మండలకేంద్రంలోని ముత్యాలమ్మ గుడి ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్న కార్తీక్ అనే యువకుడు అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని అంబులెన్స్ సిబ్బంది ఉపేందర్, రమేశ్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నర్సంపేట, మార్చి 14: మండలంలోని ముత్తోజిపేటకు చెందిన కాకి స్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి భార్య కోమల, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని శుక్రవారం అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేచారు. కార్యక్రమంలో కాకి అనిల్, జన్ను రాజు, కాకి సతీశ్, బర్ల ప్రశాంత్, కాటిపాకల రవికుమార్, పుట్ట స్వామి, కాకి రాములు, జంపయ్య, రమేశ్ పాల్గొన్నారు.